కరి మేఘాల మధ్య...

ఆదిమధ్యం రమణమ్మ

"ఇంతకీ నీ అభిప్రాయమేమిటో చెప్పనేలేదు!" అన్నాడు మధుసూదన్.

"దేనిగురించి?" అన్నది సంధ్య ఏమీ ఎరగనట్లు.

"అయితే నీకు ప్రేమలో నమ్మకం లేదన్నమాట!" అన్నాడు మధుసూదన్ – సంధ్య కళ్ళల్లోకి చూస్తూ.

సంధ్య నవ్వింది. ఆ నవ్వులో అతనికి కొంటెతనం కనిపించింది.

"ఎట్లా గ్రహించావూ? అది అక్షరాలా నిజం!" అన్నది సంధ్య తడుముకోకుండా.

"పోనీ, పెళ్ళిలో అయినా నమ్మకం ఉందా?" అన్నాడు మధు, కొద్దిగా ఆశ్చర్యపడి.

"అదీలేదు" అన్నది సంధ్య సంకోచించకుండా.

మధు కళ్ళల్లో లీలగా కదిలిన నిరాశని పోగొట్టడానికి చిలిపిగా చూసింది– సంధ్య.

ఆ చిలిపిచూపులో రమ్మని కవ్విస్తాయి. ఆ చిరునవ్వులే దూరంగా పొమ్మని బెదిరిస్తాయి. సందిగ్ధంగావున్న సంధ్య స్నేహాన్ని తేల్చుకుందామంటే ఆమె మాటలు మధుని మరింత సందిగ్ధంలో పడేశాయి.

"ఒకటి చెప్పనా? యువతీయువకులు తమ పరస్పర ఆకర్షణని ప్రేమ అని ముద్దుగా పిల్చుకుంటున్నారు. ఇంతా చేసి ఆ ప్రేమ పెళ్ళివరకైనా ఆగడంలేదు. కాలుజారినా మనసు జారినా విపత్తుల్లో చిక్కుకుంటున్నారు యువతులు. ప్రేమ పేరుతో పరస్పరాకర్షణలకుతట్టుకోలేక అటు పెద్దల్ని, సంప్రదాయాల్ని, కట్టాలనీ, కాదని ఎదిరించలేక ఇరుకులో పడుతున్నారు యువకులు. ఆ మీదట యువకులు జీవితంలో రాజీపడ్డమో లేక ఆత్మహత్యలకు పాల్పడడమో కూడా జరుగుతున్నాయి. కొందరు పెద్దల్ని ఎదిరించి పెళ్ళిళ్ళూ చేసుకుంటున్నారు. తీరా పెళ్ళిచేసుకున్నాక, ప్రేమ ఇంత చప్పగా చప్పగా వుందేమా – అని విసుగుచెందినవాళ్లూ లేకపోలేదు." అన్నది సంధ్య నిర్లిప్తంగా.

అంతావిని, "బాగుంది నీవ్యాఖ్యానం; మరైతే పెళ్ళిమీద ఎందుకు నమ్మకం లేదట?" అన్నాడు మధు.

"అమ్మో! అదంటే అసలే భయం. గుజ్జప్పందాల్లో నెగ్గడంలాంటిదే, ' అన్నది సంధ్య.

"వివాహబంధాన్ని అమ్మాయిలు ఎంతో పవిత్రంగానూ భద్రతగానూ తలుస్తారుకదా. మరి దాన్నేమంటావు?

"నిజమే; కాని ధర్మానికి కట్టుబడి ఖర్మానికి పడ్చేవోపిక నాకు లేదు, చాలామంది వివాహఫలితాలు అలాగే ఉంటున్నాయి."

"ఇలాంటి మనస్తత్వంగలదానివి, నీకు దానిలో నమ్మకముందోలేదోఅర్థం కాకుండా ఉంది!" అన్నాడు మధు ఎటూ పాలుపోక.

స్నేహంలో మనం ఇలా స్నేహితులుగా ఉండిపోతేనే రోజులుహాయిగా వుంటాయి "

"నీమాటల కర్థంలేదు సంధ్యా! మన స్నేహాన్ని మరింత సన్నిహితం చేసుకుందామనేగా వివాహం చేసుకుందామంటూంట?"

"అవుననుకో! వివాహంముందుండే ఆశయాలు వివాహమయ్యాక అశని పాతాల్లా రంగులు మార్చుకుంటాయి. మాటవరసకు నీకు నచ్చిన చీర నే కట్టననుకో. నా ప్రేమని శంకిస్తావ్. కోపగిస్తావ్. నీకు నచ్చినచీరే కట్టమని నువ్వు పట్టుబడతావనుకో, అది నిరంకుశత్వమని నిర్ధారణచేసేస్తుంది మనసు."

"అయితే నీ మీద నీకే నమ్మకం లేదన్నమాట"



"కాదు కాదు - దేనినీ నమ్మలేక పోతున్నాను మధూ. ఎంత ఆలోచించినా ఓ నిశ్చయానికి రాలేకపోతున్నాను." పోనీ తొందర్లేదు: తాపీగానే ఆలోచించుకొని నీ నిర్ణయమేదో తెలియచేస్తే నే సంతోషిస్తాను." అన్నాడు మధు హాతాశుడై.

* * *

అందమైన మేడమీద గదిలో అంత కంటె అందంగా నిలబడి హాయిగా గాలిపీలుస్తూ కురు లార్చుకుంటోంది రోజా.

నెమ్మదిగా నిశ్శబ్దంగా నడిచివచ్చి అట్టేనిలబడిపోయిన సంధ్యను, ఒక్కసారి వెనకతిరిగి చూసింది. "తలచుకోగానే దేవత ప్రత్యక్షమయినట్టు వూడిపడ్డావ్! ఎంతవరకొచ్చింది కథ?" అన్నది రోజా, సంధ్యను కూర్చోబెడుతూ.

"అది చెప్పడానికే వచ్చా! అతను చాలాదూరం వచ్చాడు. నన్నుదగ్గరికి రమ్మంటున్నాడు. నీ సహాయమూ సలహా కావాలి."

"నా సలహా సహాయమూ నా నీకు?"

"అవునే రోజీ! నాకు దేనిమీదా నమ్మకం కుదరటంలేదు. అది నా నిస్సహాయతా బలహీనతే అను. ఇంకేదైనా

అను. మనచుట్టూ ప్రపంచంలో జరిగే గొడవలు నా మనసులో మాధుర్యాన్ని నిలవనీయడంలేదు. మనసుమార్దవాన్ని కోల్పోయి మొద్దుబారి పోతూంది భయంతో !"

"బాగుంది-సిరిరా మోకాలు అడ్డినట్లు-నీ భయాల్తో నువ్వుబెదిరి అతన్ని బెదర గొట్టేస్తావేమిటి ?"

"అలా చెయ్యకూడదనే నిన్నర్థించడానికి వచ్చాను "

"అంటే ?"

"అతనో పిక్నిక్ ప్రోగ్రాంవేశాడు. నువ్వు నాతోవచ్చి అతన్ని కాస్త నవ్వించి కవ్వించు. అపుడు అతని ముఖమూ, మనసూ ఏ రంగులో తేలుతాయో చూసి చెప్పు."

"బాగుంది వరస! వన్నులాగుతావా యిందులోకి ?"

"చూడు నాకంటె ఎన్నో రెట్లు అందకత్తెవి. అతన్ని కాస్తపరీక్షించాలనివుంది నువ్వు కాస్తనటించాలి కాస్సేపు చెయ్యిపట్టుకున్నా సహించాలి."

"చాలా బాగుందేవ్! నాకు మాయామర్మం తెలీదు. బొత్తిగా నటించలేను. ఆ తంటాలేవో నువ్వే పడరాదా ?"

"అయితే అతన్ని వేరేపెళ్ళి చేసుకోమని చెప్పేస్తాను."

"అంతపని చెయ్యకు! అలాంటివాడు నీకు మరిదొరకడు."

"అయితే నువ్వు నాకీ సహాయం చెయ్యకతప్పదు. నీతో పాటు నేనుంటాగా! భయందేనికి? ఈ మాత్రం నాకు సహాయం చెయ్యలేవా?"

"ఇది సహాయంలాలేదు సంధ్యా? చిక్కులావుంది!"

"ఫరవాలేదు నే విప్పుతాగా!"

"సరే, చూద్దాంలే!"

"చూద్దాం - కాదు సిద్ధంగావుండు. రేపు మీ కారు మనకు వుండేలా చూడు; ఏం ? వస్తా-

* * *

సంధ్యతోపాటు రోజా కారుదిగడం రెప్పవాల్చకుండా చూశాడు మధు. సంధ్య ప్రక్కనున్న అందాలరాసిని చూసి, ఆశ్చర్యసంభ్రమాలు అతని కళ్లల్లో తళుక్కుమన్నాయి. సంధ్య చిరునవ్వుతో రోజాని పరిచయంచేసింది, అనుకున్నట్టుగానే ఆటపాటలతో. దాగుడుమూతలతో, నవ్వులతో, కేరింతాలతో, హాస్యాలతో, పరాచికాలతో, పిక్నిక్ ఆనందంగా జరిగిపోయిందనే చెప్పాలి. ఈడులోవున్న యువతీ యువకులు ఇటువంటి పిక్నిక్కులలో ఏ సందర్భంలో ఏ యిద్దరు సన్నిహితులవుతారో ఎవరమూ చెప్పలేం. కొన్ని అనాలోచితంగా సంభవిస్తే, కొన్ని ముందుగా ఆలోచించుకొని జరుపుకునే



సన్నివేశాలవుతై, కొన్ని మాతాత్పరి ణామాలవుతే మరికొన్ని కేవలం దైవికాలు.

ఇంటికి తిరిగొచ్చాక రోజా గుండెల్లో ఏవో భావాలు గుబాళిస్తు న్నాయి. పైకి కనపడే చిరాకే కనిపెట్ట గలిగింది సంధ్య.

"ఏమయిందే; తల నొప్పిగా ఉందన్నావ్. ఇంతకీ పరీక్ష చేశావా లేదా?" అన్నది సంధ్య.

"ముందే చెప్పానుగా- అది నావల్ల గాదని ? అన్నది రోజా.

''అయితే ఎందుకలా చికాకు పడి పోతున్నావ్ ; అతనేమైనా అసభ్యంగా ప్రవర్తించాడా ?''

"లేదు" అంది ముక్తసరిగా రోజా.

"అయితే ఈ కోపమూ తాపమూ ఏమిటి?"

"నన్ను విసిగించకు సంధ్యా! నాకేమీ తెలియదు. ఆ పరీక్షలేవో నువ్వే చేసుకో. నేనేమీ చెప్పలేను."

సంధ్య ఇంకేమీ ప్రశ్నించలేక పోయింది. కాని ఏదో జరిగేవుంటుం దని మటుకు ఆమెకు లీలగా తట్టింది.

కనీసం ఆ జరిగిందైనా తెల్సుకుం దామని మూడునాల్గుసార్లు రోజా యింటికి వెళ్ళివచ్చింది. కాని రోజా బయటపడలేదు; ఆమె మనసులో ఏదో బాధ గూడుకట్టుకున్నట్లు మాత్రం విశదమౌతోంది అందులో ఆమె మనసు చిక్కుకుంది. బైటికిరావడం లేదు; చప్పున రోజా మాటలు గుర్తు

కొచ్చాయి. 'చిక్కులావుంది గాని సహాయంలా లేదని'. తానా చిక్కు విప్పుతానన్నది. నిజంగా రోజా ఏదైనా చిక్కులోనే పడిందా? ఏమీ చెప్పదే? అవును- ఎలా చెబుతుంది? చెప్పదు. మధు ద్వారా ప్రయత్నించేస్తే ఫలితమౌతుందేమో? వూహారావడమే తడవుగా మధూకి ఫోనుచేసింది. సముద్రపొడ్డున సాయంకాలం కల్సుకుందామని.

కాలేజీవదిలి యివతల కొచ్చేసరికి కారులో సిద్ధంగా వున్నాడు మధు.

సంధ్య వచ్చి మామూలుగా ప్రక్కన కూర్చుంది.

"ఆ అమ్మాయి ఎవరు సంధ్యా?" అని ప్రశ్నించాడు మధు.

"నా స్నేహితురాలు. వేరే చెప్పాలా?" అన్నది సంధ్య.

"చాలా అమాయకురాలులావుంది. ఇలాంటి అమాయకులు ప్రతీవారినీ నమ్మేస్తారు. తాము నమ్మినవారికి ప్రాణాలుసహితం ధారపోస్తారు. ఇటువంటి అమాయక స్త్రీల గుండెల్లోనే మన భారతీయ స్త్రీధర్మం సురక్షితంగా పెరుగుతోందంటాను." అంటూ ఏదో చెప్పుకుపోతున్నాడు.

రోజా అంతగా ఆకర్షించుకుందా మధూని? వూవువెళ్ళి చక్కని కొమ్మనే చేరుకుంది. ఆc- ఏదో గుర్తుకురాగా అదిరిపడింది- సంధ్య. రోజాకూడా ఇదే స్థితిలో పడిందా? అందుకే తనతో చెప్పలేకపోతూందా? ఏమిటి దారి? రోజా అట్టే గుమ్మందాటని గొప్పింటిబిడ్డ. మేనరికంబావ విదేశాలనుంచి రావడమేతడవు- పెళ్ళి జరిగిపోతుంది. యీ స్థితిలో యిలా కథ అడ్డంతిరిగితే, తన గతిమాట దేముడెరుగు; తన మర్యాద దక్కదు; చాలా గొడవలు విరుచుకుపడటం తప్పదు.

తన ఆలోచనల్లో తాను మునిగి తేలుతోంది సంధ్య. మధు తన ధోరణిలో తానున్నాడు ఇద్దరూ కారు దిగేవరకు ఒకర్ని ఒకరు పట్టించుకోలేదు.

సముద్రపొడ్డున చాలాసేపు గడిపారుగాని మామూలు మాటలే దొర్లాయి. మధు ప్రవర్తనా మాటలూ తేడాగా కనిపించాయి సంధ్యకి. తను స్నేహితులుగా వుందామని కోరింది. అందుకలా వున్నాడా? లేక రోజా ఆకర్షణలో పడ్డాడా? తన నిశ్చయం చెప్పేదాకా లేచి నిగ్రహం చూపించాలనుకుంటున్నాడా? తన వెర్రికాకపోతే అతని మనసును రోజా ఆకర్షించుకుందని తెలుస్తునేవుంది.

చిక్కల్లా రోజాని ఇతనికిస్తారా? ఒక చిక్కుని విడదీద్దామని ప్రయత్నిస్తే మరిన్ని చిక్కులు వచ్చిపడతాయని తానూహించలేకపోయింది సంధ్య.

రోజాకూడా మధూ ఆకర్షణలోపడి వుంటుందన్న వూహ వచ్చినప్పటినుంచీ



భయంతో సంకోచంతో రోజాకి దూరంగా వుండిపోతూ వచ్చింది సంధ్య.

* * *

రఘు బావ వస్తాడన్న వార్త ఎంత సంతోషాన్ని కల్గించిందో దానికితగ్గ భయాన్నీ బాధనీకూడా కల్గించింది రోజాకి.

అతగాడు రానేవచ్చాడు భోజనం చేసి మేడపైన హాయిగా నిద్రపోతున్నాడు. అమ్మతృప్తికోసం కళకళలాడేలాగే ముస్తాబయింది. మనను మాత్రం కళావిహీనమై పోయింది. తల్లి పరధ్యాన్నంగా వున్న రోజీని వుద్దేశించి – "అంత సిగ్గేంటే మొద్దూ! అత నీ పాటికి లేచివుంటాడు ఈ ఫలిహారా, బొబ్బట్లూ; తీసుకువెళ్ళు''' అని వెండిపళ్ళెంనిండా సర్దియిచ్చింది.

గుండెలు నిండిన గుబులు. బరువైన అడుగులలో బావవున్నగది ప్రవేశించింది రోజా.

అప్పటికే లేచి ఆమెకోసమే అన్నట్లు ఎదురుచూస్తున్నాడు రఘు "అదేంటి రోజీ! అచ్చు సినిమాలో పెళ్ళికూతుర్లా నడుస్తున్నావ్ ? నన్ను మర్చిపోలేదు కదా?" అంటూ నవ్వాడు.

తన కాకులాసా కరువైనా నవ్వక తప్పదు, జరిగింది బావకి చెప్పకా తప్పదు. తనమనసులో రహస్యం దాగదు. ముందుగా చెప్పడమేమంచిది– పరిష్కారం బావకేవదిలి.

"నే నెలామర్చిపోతాను బావా! భారతదేశంలో వున్నదాన్ని నేను. పరాయిదేశంలో వున్నవాడివి నువ్వు. నువ్వే మర్చిపోవాలి - ముందివి తిను. ఇలాంటివి తిని ఎన్నాళ్ళయిందో!'' అన్నది తెచ్చిపెటుకున్న నవ్వుతో.

"నువ్వూతిను,'' అన్నా డతను.

ఆట్టే ప్రతిమాలించుకోవడం ఇష్టం లేక తానూ తినడం ప్రారంభించింది రోజీ.

"ఏదో పరాకు చిత్తగిస్తున్నావు- బాగుంది," అన్నా డతను.

"అవును- అనేసింది రోజా- చటుక్కున.''

రఘు ఆశ్చర్యంగా చూశాడు- రోజా ముఖంలోకి.

తన తొందరపాటుకీ, బావమాటకీ కళ్ళనీళ్ళు తిరిగాయి రోజీకి. తలవాల్చేసుకొంది.

"విషయ మేమిటి?" అన్నాడు రఘు.

"ఇక్కడకాదు- మనం సాయంత్రం బీచ్ కిపోతాంగా? అక్కడ చెబుతాలే!" అని తప్పించుకున్నది రోజా.

"అయితే తొందరగా తయారవుతాను! అన్నాడు. ఉభయులూ మరో గంటకల్లా బీచిలో నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలోకి వచ్చి కూర్చున్నారు.

ఎలా మొదలుపెట్టాలో తెలీక తిక మకపడినా వీలైనంత క్లుప్తంగా జరిగింది జరిగినట్లు చెప్పింది రోజా.

"బావా నన్ను పరీక్షించమన్నది కాని, పరీక్షకు పెట్టినట్లు అయింది. ఓడించమంది - నేనే ఓడిపోయాను. నటించమంది - నేనే నటించలేక పోయాను. మధురానుభూతిని పొందాను. నా మనసు మలినపడింది బావా! తప్పని తెల్సికూడా అదే మధురానుభూతిని కోరుతోంది మనసు. మిత్రురాలి అదృష్టాన్ని అపహరించనా, చిన్నప్పటినుంచీ నామీద పెట్టుకున్న నీ ఆశల్ని తుంచనా, అమ్మనీ, నాన్ననీ దుఃఖంలో ముంచనా, ఈ అన్యాయం నే నెల్లాచేయను? ఇంకో విషయం. మాకున్న భాగ్యమంతా మాదికాదు బావా! - నీది. నిన్నూ నీ భాగ్యాన్నీ సురక్షితంగా చూడమని అత్తయ్య నాన్న చేతుల్లో పెట్టింది. భాగ్యం మనుష్యుల్ని పెడత్రోవ పెట్టించే అవకాశ ముందని, నీకు తెలియకుండా నే నిన్నూ నీ భాగ్యాన్నీ అత్తయ్య ఆశించినట్లే సంరక్షించారు నాన్న. తన భాగ్యమైన నన్నూ, నీ భాగ్యాన్నీ ఒకేసారి నీ చేతుల్లో పెట్టా లనుకుంటున్నారు నాన్న. యిందరి ఆశలూ నే నేం చెయ్యాలి బావా? నే నేం చెయ్యాలి? మలినపడిన మనసును నీకు - నీకు - ఎలా అర్పించను? శోకావేశంతో వివశయై తన గుప్పెట్లో ముఖాన్ని దాచుకున్నది రోజా.



రోజా చెప్పేవి వింటూ నిశ్చేష్టుడే అయ్యాడు రఘు. కాని బుద్ధి చురుగ్గానే పని చేస్తోంది, మనసు శాంతినే సృష్టిస్తోంది. "రోజీ, నువ్వు చెబుతున్న విషయాలన్నీ ఆశ్చర్యంగానే ఉన్నాయి. నేను విదేశాల్లో వుండివచ్చిన వాణ్ణి. నీ మనసెవర్నో తాకిందనీ, నిన్నెవరో తాకారనీ, నువ్వు మైలపడిపోయావనీ భావించలేను. చిన్నతనంనుంచీ ఒక చోట పెరిగాం. ఆపాటి అభిమానాలు వుండే వుంటాయి. నాకు నువ్వు కావాలి-అని కాక-నీ కోరిక తీర్చడమే నా అభిలాష. పోతే ఆ అమ్మాయి విషయం ఆలోచించవల్సినదే. అయినా ఆ అమ్మాయికి అతనిమీద యింకా నమ్మకం కుదరలేదనేగా యిదంతా జరిగింది. నీ ఆశ ఫలిస్తే ఫలించవచ్చు. నాకోసారి ఆ అమ్మాయిని చూపించు. జీవితాన్ని అంత అపురూపంగా చూసుకుంటున్న ఆ అమ్మాయిని చూడాలి. మామయ్య ఉదారహృదయానికీ, దూరాలోచనకీ, చాలా కృతజ్ఞుణ్ణి. ఆ సంపద ఇకముందుకూడా మామయ్యదిగానే భావించాలన్న నాకు బాధగా వుండదు. నీకు భాగమివ్వమన్నా ఇవ్వగలను. ఆ విషయంలో నిశ్చింతగా వుండు. మనిద్దరికీ బంధుత్వముంది. అభిమానముంది ఆ బాంధవ్యాన్ని మరింత బంధించాలనుకున్నారు మనవాళ్లు అంతే; ఇందులో ప్రేమలూ భంగపాట్లూ ఏముంటాయి?" అన్నాడు రఘు.

ఎంతో అనుభవం వున్న వేదాంతిలా బావ మాట్లాడిన మాటలు విన్నాక తేలిగ్గా వూపిరి పీల్చుకుంది రోజీ. ఏమీ జవాబు చెప్పలేదుగాని, కృతజ్ఞతగా చూస్తూ ఉండిపోయింది.

"పిచ్చిరోజీ! ఎంత అమాయకు రాలవు! ఎంత స్వచ్ఛమైనది నీ మనసు! యిప్పటికైనా చింత వదిలెయ్యి-పద! చీకటి పడుతోంది, యింటికిపోదాం" అని రోజీ చెయిపట్టుకు లేవదీశాడు రఘు.

* * *

రోజా కోసం లోనికిపోబోతున్న సంధ్యని, "యింట్లో ఎవరూలేరండీ," అన్న మాటలు ఆపేశాయి. ముందు హాల్లో సోఫాలో కూర్చున్న రఘుది ఆ గొంతు.

ముందుకువేసిన అడుగు వెనక్కి తీసుకుంది సంధ్య.

"మీరు రోజా బావకదూ! నమస్తే! సంధ్య వచ్చి వెళ్ళిందని చెప్పండి. ఎక్కడికి వెళ్ళింది రోజా?"

"నమస్తే! అత్తయ్యా మామయ్యా గీతోపన్యాసాలు వినడానికి వెళ్ళారు. రోజా ఎవరో మిత్రురాల్ని కల్సుకుని వస్తానని వెళ్ళింది. తను వచ్చేవరకు మిమ్మల్ని ఉండమంది. మిమ్మల్ని వెళ్ళకుండా ఆపమని, నన్నెక్కడికీ వెళ్ళనివ్వకుండా ఇక్కడ ఆపింది" అన్నాడు రఘు పేపరు ప్రక్కనపెట్టి.

రోజా చెప్పిన మాటలు అతని నోటి నుంచి హాస్యధోరణిలో వస్తుంటే చిన్నగా నవ్వుకుంది సంధ్య. సంకోచిస్తూనే నిలబడిపోయింది.

"భయపడకండి. మనం ఎంత ముందుకు పోయామనుకున్నా మన ప్రాథమికమైన భయాలూ సంకోచాలూ మనల్నింకా వదల్లేదు. పోనీ యింట్లోవద్దు. వాళ్లు వచ్చేవరకు ముందు గార్డెన్‌లో కూర్చుందాం రండి." అంటూ లేచాడతను.

అతని వెనకాలే బొమ్మలా నడిచి వెళ్ళి, కాస్త ఎడంగా ముడుచుకు కూర్చుంది సంధ్య. అతనితో ఏం మాట్లాడుతుంది? ఏం మాట్లాడాలి? ఏం మాట్లాడకపోతే ఏమనుకుంటాడో-ముఖ్యంగా రోజీ తిడుతుంది.

"విదేశాలు తిరిగొచ్చారటగా? అక్కడి వింతలు చెప్పండి వింటాను!" అన్నది సంధ్య. సంగీతసభ చేసేటపుడు గొంతు సవరించుకున్నట్లుగా సవరించుకొని.

"ఏమున్నాయి? మీ ఆడవాళ్ళంతా పత్రికల్లో తెగరాస్తున్నారుగా... దేశదేశాల గురించి వేరే చెప్పడానికేముంది?"

"అవుననుకోండి! పోనీ మగవారి దృష్టిలో మీఅభిప్రాయాలేమిటో వినాల్నుంది. చెప్పరాదా?"



"ఏముంది? ఎత్తుగా ఆకాశాన్నంటే మేడలూ అంతులేని కార్లూను."

"అది కాదండీ."

"మరేమిటి? అక్కడ అభివృద్ధినీ అభ్యుదయాన్నీ దృష్టిలో పెట్టుకుని అనవరతం తీవ్ర కృషిచేస్తారు. సాధిస్తారు. కాలం అమూల్యంగా భావిస్తారు. బిజీగా వుంటారు - ముఖ్యంగా సోమరులు కారు."

"అది కాదండీ"

"మరేమిటి? మీకు కావల్సినది సూటిగా అడగరాదూ?"

"స్త్రీ పురుషుల గురించి."

"ఓ అదా! యువతీ యువకులు స్వేచ్ఛగా తిరుగుతారు. ప్రేమించుకోవడానికి, పెళ్ళి చేసుకోడానికి చక్కని సావకాశాలు వున్నాయి అలాగే విడాకులూ ఇచ్చేసుకొంటారు. అన్నింటికీ స్వేచ్ఛ వున్నమూలంగా వంచన ద్రోహాలకు ఆట్టే సావకాశం లేదు"

"స్త్రీ లెలా వుంటారు?"

"ఆకర్షణీయంగా ఆరోగ్యంగా వుంటారు."

"మిమ్మల్ని ఏ స్త్రీ అయినా ఆకర్షించుకుందా," అని అడిగేసి, చటుక్కున నాలిక కర్చుకుంది - సంధ్య.

రఘు చిత్రమైన చూపు చూసి నవ్వాడు, "ఒక్కరిద్దరు ఆకర్షించుకున్నారు కలిసే తిరిగాం. అయితే నండూరివారి యెంకిలా మాత్రం హృదయంలో హత్తుకుపోరు."

ఆశ్చర్యంతో అతనివైపు చూసింది సంధ్య. "మీరు యింకిలాంటి వ్యక్తి అవుతే మీ కిష్టమన్న మాట?" అన్నది.

"అవును, మనసులో మరువలేని మనుష్యులూ ఆరాధనా, నా కెంతో యిష్టం."

"అయితే రోజీ ధన్యురాలే."

"ఆ సంగతి మీకే తెలియాలి!"

"అదేం? రోజా మీరు చిన్ననాటి నుంచీ ప్రేమించుకుంటున్నారు కదా, పెళ్ళి కాబోతూంది కదా!"

"మేం ప్రేమించుకోలేదు, అభిమానించుకుంటున్న మాట నిజమే, కాని ప్రేమగాథ ఏదీలేదు మా మధ్య!"

"అయితే మీ మనసు వేరుగా వుందని రోజీకి అన్యాయం చేస్తారా?" ఆవేశంగా అడిగింది.

"రోజాకి అన్యాయం చెయ్యకూడదనే నా వుద్దేశం.

"అంటే?"

"అంటే - ఏమిటో యిప్పుడే చెప్పలేను. రోజా మనసారా నన్నుకోరుతుందో లేదో తెల్సుకోవాలి."

ఆ మాట వింటూ ఘ్రమా న్ప డి పోయింది సంధ్య. తన అనుమానాలూ భయాలూ నిజమై పోవుకదా? తనా నిజాన్ని యిప్పుడు వినేస్థితిలో లేదు. మాట మార్చడానికి ప్రయత్నించింది.

"మీరు నాతో చెప్పిన కొన్ని విషయాలు రోజీకి చెప్పకండి దాని మనసు గాయపడ్డమేగాక మిమ్మల్ని పెళ్ళాడదు," చిలిపిగా అంది చిన్నగా నవ్వుతూ.

"మా మధ్య రహస్యాలు లేవు. పెళ్ళాడకపోతే ఫరవా లేదులెండి. మరొకర్ని చేసుకుంటాను! ఏం పోయింది?" అన్నాడు రఘు నిర్లిప్త భావంతో

అదిరిపడింది సంధ్య!

"ఆఁ! అంత తెలిగ్గా రోజాని రోజా భాగ్యాన్ని వదులుకుంటారా? చిన్నతనంనుంచీ కలిసిమెలసి ఒకర్ని ఒకరు బాగా అర్థం చేసుకున్నట్లు వుంటుందా పరాయివార్ని చేసుకుంటే? ఫలితాలు ఎలావుంటాయో, ఆలోచించుకున్నారా?" అన్నది.

"అవసరమైతే, విషయాన్ని తేలిగ్గానే తీసుకుంటాను. చిన్నతనం నుంచీ అర్థం చేసుకుని అభిమానించుకున్న మాటనిజమే - పరాయివారి ఆకర్షణ యింకా బలంగానూ యింకా అందంగానూ ఉండొచ్చుకదా!" అన్నాడు రఘు.

"సరిగా ఏమీతెలియకుండా చేసుకునే వివాహంమీద మీకు విశ్వాసముందా?" అన్నది సంధ్య ఆశ్చర్యంతో!

"వుంది."

"కారణం?"

"నేను పురుషుణ్ణి! సాధారణంగా మనదేశంలో స్త్రీలు తమ జీవితకోమల

పుష్పాన్ని, పెళ్ళికాగానే భర్తపాదాల చెంత విడుస్తారు. ఆ పుష్పాన్ని అలా కాలిక్రింద నలిగిపోయే పరిస్థితిని తప్పించి, దాన్ని సుతారంగా లేవనెత్తి హృదయానికి హత్తుకుంటే, దాని మెత్తదనం, గుండెల్లోని తీయ్యదనం, రేకులలోని సువాసనా, తప్పక ఆనందం కలిగిస్తాయి. అలా చెయ్యగలననే నమ్మకం వుంది నాకు. రోజా ఒక్కటే పువ్వా? మల్లి వుంది, మాలతి వుంది, పారిజాతం వుంది, బొగడవుంది. వీటిలో వేటికవే గొప్పవి కావా?"

అతనిమాటలు మంత్రముగ్ధలా వింటూ వుండిపోయింది సంధ్య.

"బాగా చీకటిపడింది. ఇంకా రోజీ రాలేదు; మళ్ళీ కలుస్తానని చెప్పండి" అని లేచిందామె. గబగబా అడుగులు వేసి గేటుదాటి రిజా పిలిచి ఎక్కింది, గుండెల బరువు దించుకుని తేలిగ్గా ఊపిరిపీల్చుకుంది. చిత్రమైన మనిషి; స్వచ్ఛంగా మాట్లాడుతున్నా అతని

చిత్తం అంతుచిక్కడం లేదు. మొత్తం మీద రోజాకీ అతనికీ మనసులు వేరయాయి. దానికి కారణం తనే అయితే ఆ దారుణం తను ఓర్చుకోలేదు. ఆలోచించడానికే భయంగా వుండి మనసును మరోవైపుకు త్రిప్పుకోడానికి ప్రయత్నించసాగింది సంధ్య.

*　　*　　*

ఆసాయంకాలం తెల్లటి నురుగులు క్రక్కుతూ సముద్ర కెరటాలు గుఱ్ఱాల్లా పరుగులుతీస్తున్నాయి. మధు మౌనంగా తలవాల్చి కూర్చున్నాడు.

ఈ చిక్కుసమస్య తానే తెచ్చి పెట్టింది. ఇది తానే పరిష్కరించాలి. మరెవరివల్లా ఈ పని అయేటట్లులేదు. అని మనసులో ఒక నిశ్చయానికి వచ్చిన సంధ్య తలఎత్తి అన్నది "మధూ నీ మనసు రోజాని కోరుతుందికదూ. శ్రమపడి నువ్వు నిజం చెప్పక్కరలేదు. నేనే వూహించుకుంటాను. కాని అబద్ధం చెప్పడానికి మాత్రం ప్రయత్నించకు."

అదిరిపడ్డాడు మధు. ఎదురుగా చూశాడు. మళ్ళీ తలవంచి క్షణం ఆలోచనలలో మునిగాడు. సంధ్య చేతిని తన చేతిలోకి మృదువుగా తీసుకుని అన్నాడు. "సంధ్యా! రోజా నా మనసును ప్రలోభపెట్టినమాట నిజమే కాని, ఆ కారణంగా నిన్ను అన్యాయం చెయ్యను. నా నిశ్చయాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి రాలేదు."

సంధ్య నవ్వింది. "మధూ! మొదటి నుంచీ నిన్ను నా మిత్రుడుగానే భావిస్తున్నాను. ఇందులో నాకన్యాయం ఏముంది? ప్రేమఅన్నా, పెళ్ళన్నా భయం నాకు. అదీ ఒకందుకు మంచిదే అయింది. ఒక మిత్రునికోరిక మన్నించలేనా? ఏపాటి వీలున్నా తీర్చడానికి ప్రయత్నిస్తాను." అంటూ లేచి నించుంది.

"వద్దుసంధ్యా! వద్దు! అలాంటి ప్రయత్నం చెయ్యకు" అని మధు వారించినా, సంధ్య వినిపించుకోలేదు.

సరాసరి అక్కడనుంచి రోజావద్దకు చక్కా వచ్చింది. రోజా పక్కమైన పడుకుని పుస్తకం పట్టుకుంది. గదిలో చీకటి దట్టంగా వున్నా దీపంలేదు.

దీపంవేసి మెల్లగా ఆమెప్రక్కన చేరికూర్చుంది-సంధ్య "దీపం లేకుండా ఏం చదువుతున్నావే?" అంటూ.

ఉలికిపడి సర్దుకుని లేచి కూర్చుంటూ "నువ్వా! గాలివిసురులా వచ్చావు? ఏం కథ?" అన్నది రోజా.

"పోనీ వానజల్లుగా అను; మన మాటలకేంగానీ, రోజా! ఆరోజునుంచీ నువ్వు నాతో ముభావంగా ఉంటున్నావు. మనసు దాస్తున్నావు- ఎందుకని?

మౌనంగా ఉండిపోయింది రోజా.

"సరే-పోనీ, ఇంతకీ అతన్ని నే పెళ్లి చేసుకోనా వద్దా? అదయినా చెప్పు."



"ఏమోనే! అది నువ్వే తేల్చుకో వాలని చెప్పానుగా?"

"పోనీ నీ సంగతి చెప్పు. మీ బావ వచ్చాడుగా. ఏమైనా పెళ్ళిమాటలు వచ్చాయా?''

ఈ ప్రశ్నకి రోజా గుండెలు దడదడా కొట్టుకున్నాయి. జవాబు ఇవ్వలేదు; తిరిగి తనే ప్రశ్నవేసింది. "సంధ్యా, బావ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?"

"మీ బావకేమే? నిక్షేపంలాంటి మనిషి!" అన్నది సంధ్య. అబ్బే ఇలా మాట్లాడితే లాభంలేదు, సంగతితేలదు. అని మనసులో అనుకుని మాటని మరో రకంగా త్రిప్పింది. "కాని ఎంతలేదన్నా విదేశాలు వెళ్ళి వచ్చాడుకదా! మనసులో కొంత మార్పు వచ్చి ఉంటుంది. తన మనసు దాచిపెట్టి నీవు మనసారా ఒప్పుకుంటేనే ఈ పెళ్ళి జరుగుతుందని నేరం నీపైనే నెట్టాడు"

బావనంటుంటే సహించలేక పోయింది రోజా. "అందులో అతని నేరమేమీ లేదే, అతనలా అనడానికి కారకురాల్ని నేనే" అంది

"ఆఁ నువ్వా కారణం?" అంది ఆశ్చర్యంగా సంధ్య.

"నే చెప్పలేను సంధ్యా! నన్ను బాధించకు."

"చెప్పొద్దులే నేనే చెప్పుకుంటాను. తిట్టకు, నీ మనసు మధూవైపు ఆకర్షింపబడిందికదూ?''

అదివిని విలవిల్లాడిపోయింది రోజా. ''వద్దు సంధ్యా! వద్దు. ఈ విషయం మాట్లాడితే నీకు చాలాద్రోహం చేసిన దాన్ని అవుతాను."

ఓసి...నీ...యిదా నువ్వు నన్ను తెల్సుకున్నది? అతను నాకు మిత్రుడు మాత్రమే అని నీకు బాగా తెల్సు. ఇద్దరు మిత్రులు ఒకటవడం నాకు ద్రోహ మేమిటే? కానీ మీ బావ-"

"మా బావ కేనాడో చెప్పేశాను". అంది రోజా ఏడుపు ఆపుకుంటూ.

"అయితే యింకేం - నిన్ను చేపట్ట గల అన్ని అర్హతలూ మధూకున్నాయి. ఏర్పాట్లు చకచకా చెయ్యొచ్చు."

"నువ్వేం చెయ్యొద్దు."

"మరెలా?"

తన్ను తాను కూడ దీసుకుని అంది అంది రోజా, "నువ్వు బావని పెళ్ళి చేసుకోడానికి అంగీకరిస్తేనే నా మనసు కెళ్ళినదారిని నేను ప్రయాణిస్తాను. లేకుంటే లేదు. ఆలోచించి ఏ మాటా చెప్పు. మరింకేం నాకు చెప్పొద్దు, వెళ్ళు తక్షణం వెళ్ళిపో," ముందుకు తోసింది సంధ్యని

రోజా ప్రవర్తన బాధగావున్నా శాంతం సహించింది సంధ్య. తప్పు తనదే కాబట్టి. శిక్ష వేసినట్లు రోజా మాట్లాడంలో తప్పు లేదు. ఆలోచిస్తూ అడుగులో అడుగు వేసుకుంటూ మరో సమస్య తలెత్తింది. యిదెలాగా, అని పరాగ్గానడుస్తూ గేటుదాకా వచ్చింది; గేటు దాటింది 'కుడిఎడమవటం పొర పాటా?' ఎవరో కాదన్నారు. పొర పాటేనేమో ? కాకపోవచ్చు !

మెల్లిగా మెత్తగా వచ్చి కారు ఆగడంగాని అందులోంచి రఘు దిగడం గాని ఆమె గమనించలేదు - కుడిఎడ మలమధ్య ఉన్న తను.

గేటుదాటగానే "ఓ సంధ్యాదేవి! మీరా ? కారుఅడ్డంగావుంది, చూసుకో కుండా వెళ్ళిపోతున్నా రేమిటి? రండి నే దిగబెడతా!" అని తిరిగి కారు ఎక్కాడు రఘు.

మతిస్వాధీనంలో లేని దానిలా కారులో ఎక్కికూర్చుంది సంధ్య.

"ఎక్కడికి? మీ యింటికేనా? అని ప్రశ్నించాడు రఘు "

"ఇంటికొద్దు! సముద్రంలో దింపండి!" అంది కసిగా, మనసులో అనుకున్న మాటలు పైకివచ్చేసినందుకు నాలిక కొరుక్కుంది సంధ్య" మళ్ళీ కంగారుగా అంది. "వద్దు నాకు స్నేహంమీదకూడా నమ్మకంపోయింది. ఇంటికే చేర్చండి."

రఘు ఆ మాటలకి పకపకా "పోనీ నన్ను డ్రైవరు అనుకోండి కాస్సేపు," అన్నాడు.

మనసులో ఎంతవిసుగ్గావున్నా ఆ మాటకి నవ్వకుండా వుండలేక పోయింది సంధ్య.

అతనినవ్వులో ఆమెనవ్వు కలిసిపో యింది. పొరపాటు లేకుండానే కుడి యెడమయింది.

కారు సముద్రపొద్దుకే దారితీసింది.